సాక్షి
నిజామాబాద్
ఆదివారం ; 22 ; డిసెంబర్ ; 2024



మంత్రి వర్యా..
జిల్లా వైద్యారోగ్యశాఖ పాలన అస్తవ్యస్తంగా సాగుతోంది. ఎనిమిదేళ్లుగా రెగ్యులర్ డీఎంహెచ్‌వో లేకపోవడంతో గాడితప్పింది.
- 10లో ▸



ముగిసిన సీఎం కప్ టోర్నీ
గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్వహించిన జిల్లాస్థాయి సీఎం కప్ టోర్నీ ముగిసింది.
- 10లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 30.6 /18.0
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మంత్రి దామోదర పర్యటన ఇలా..



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర వైద్యరోగ్య శాఖమంత్రి దామోదర్ నర్సింహ ఆదివారం జిల్లాకు రానున్నారు. ఉదయం 10.45 గంటలకు నిజామాబాద్ నూతన కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌లో దిగుతారు. రహదారి మీదుగా రెంజల్ వెళ్లి అక్కడ పీహెచ్‌సీ భవనాన్ని మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభిస్తారు. 12.30 గంటలకు జిల్లా కేంద్రంలోని నూతనంగా నిర్మించిన మాత శిశు సంరక్షణ భవనాన్ని ప్రారంభిస్తారు. 2గంటల నుంచి 3గంటల వరకు జీజీహెచ్‌లోఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

రాష్ట్రస్థాయికి పరిశోధన పత్రం ఎంపిక



కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు చౌదారపు రాంప్రసాద్ గణిత బోధనలో ఉపయోగపడే డిజిటల్ వనరులు, యాప్‌లపై చేపట్టిన పరిశోధన పత్రం రాష్ట్రస్థాయికి ఎంపికైంది. డిసెంబర్ 22న శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జరుపుకునే జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన సంస్థ నిర్వహించిన స్టేట్ సెమినార్ ఆన్ మ్యాథమెటిక్స్ ఎడ్యుకేషన్‌లో 'వేదిక్ మ్యాథ్స్ నుంచి క్వాంటం కంప్యూటింగ్' అనే అంశంపై పరిశోధన పత్రాలను ఆహ్వానించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాంప్రసాద్ తన పరిశోధన పత్రాన్ని సమర్పించగా రాష్ట్రస్థాయికి ఎంపికైంది. డిజిటల్ ఉపకరణాల ద్వారా తక్కువ సమయంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవచ్చని రాంప్రసాద్ అన్నారు. ప్రభుత్వం గణిత ఉపాధ్యాయులు అందరికీ డిజిటల్ బోధన పై శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న నిరసన




నిజామాబాద్‌అర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన శనివారం కొనసాగింది. ఉద్యోగులు యజ్ఞం నిర్వహించి వినూత్నరీతిలో నిరసన తెలిపారు. తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేసి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసనలో మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరులైన్ల రహదారిగా కంఠేశ్వర్ బైపాస్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ ఆరులైన్ల రహదారిగా మారనుంది. ప్రస్తుతం నాలుగు లైన్లుగా ఉన్న ఈ రోడ్డును విస్తరించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి.
రూ.36 కోట్ల అంచనా వ్యయంతో ఆరు వరుసల రహదారిగా అభి వృద్ధి చేయనున్నారు. త్వరలో ప్రభుత్వం అనుమతులు జారీ చేసే అవకాశం ఉంది.

గణితం.. సులువైన శాస్త్రం

- నిత్య జీవితంలో భాగమైంది
- భవిష్యత్తుకు బాటలు వేసే శాస్త్రం
- విద్యార్థులకు ఉదాహరణలతో పరిచయం చేయాలి
- ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు గణితం పై ఆసక్తి పెంచాలి
- నేడు జాతీయ గణిత దినోత్సవం



లెక్కల క్లాసంటే పిల్లలకు భయం పట్టుకుంటుంది. నేర్చుకుంటే గణితం సులువైన శాస్త్రమేనని గణిత మాస్టార్లు చెబుతున్నారు. భవిష్యత్తుకు బాటలు వేసే గణితం మనిషి జీవితంలో ఓ భాగమై పోయింది. లెక్కలు లేనిదే నిత్య జీవితం గడవదు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన గణిత శాస్త్రంలో విద్యార్థులను నిష్ణాతులను చేయడానికి ' తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ' తన వంతు కృషి చేస్తోంది. ప్రతిభ పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో సృజనను వెలికి తీస్తోంది. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ పుట్టిన రోజును జాతీయ గణిత దినోత్సవంగా నిర్వహిస్తున్నాము. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..



నిజామాబాద్‌అర్బన్/ఆర్మూర్/మోర్తాడ్ (బాల్కొండ): మానవుని మేదస్సును అత్యున్నత స్థాయికి చేర్చే శాస్త్రమే గణితం.. నిత్య జీవితంలో భాగమైంది. మనిషి నిద్ర లేచింది మొదలు పడుకునే వరకు ప్రతి క్షణం గణితంతో ముడిపడి ఉంది. టైం లెక్కించడం, డబ్బు, చేసే పని, వినోదం, విజ్ఞానం చివరకు తినే ఆహారం ఇలా ఎన్నో కార్యక్రమాలలో గణితం తనవంతు పాత్రను పోషిస్తుంది. గణితం వల్ల విద్యార్థుల్లో తార్కిక ఆలోచన పెరుగుతుంది. లెక్కలు అంటే కష్టం కాదు ఇష్టంతో చదివితే ఎంతో పరిపూర్ణమైన జ్ఞానం లభిస్తుందని గణిత ఉపాధ్యాయులు చెబుతున్నారు. గణిత సబ్జెక్టులో రాణించిన వారు ఇతర సబ్జెక్టుల్లోనూ ప్రతిభ చూపడానికి అవకాశం ఉంది. గణిత శాస్త్రంను ఇతర శాస్త్రాలతో పోల్చితే విద్యార్థులు ఎక్కువ మార్కులు స్కోర్ చేయడానికి అవకాశం ఉంది. ఒక ఫార్ములా ప్రకారం మెథడ్‌ను ఉపయోగించి సమాధానాలు రాస్తే గణితంలో అత్యధిక మార్కులు సాధించవచ్చు అని ఎంతో మంది నిరూపించారు. అందుకే గణితంను 'క్వీన్ ఆఫ్ సైన్స్'గా పరిగణిస్తున్నారు.

లెక్కలంటే భయం పోవాలి

ప్రాథమిక స్థాయి నుంచి పిల్లలకు గణితం పట్ల భయాన్ని పోగొట్టడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలి. రామానుజన్ జీవిత చరిత్రను చెబుతూ గణితం పట్ల పిల్లలకు ఆసక్తి కలిగించాలి. గణిత ప్రత్యేక భాషను పిల్లలకు సరైన ఉదాహరణలతో పరిచయం చేయాలి. నిత్య జీవిత సమస్యలకు గణితాన్ని అన్వయించి బోధించాలి. పజిల్స్, అబాకస్, బోర్డులు, పూసల చట్రం వంటి బోధన విధానంతో గణితం పట్ల భయాన్ని పోగొట్టి ఆసక్తి కలిగేలా చేయాలి.

తెలంగాణ మ్యాథ్స్ ఫోరం..

పాఠ్య పుస్తకాల్లోని ప్రశ్నలకు మాత్రమే సమాధానం చెప్పడం కాకుండా, విద్యార్థులు సొంతంగా ఇతర ప్రశ్నలను సైతం పరిష్కరించే విధంగా వారిలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడం కోసం తెలంగాణ రాష్ట్రంలో 2014లో విద్యా శాఖ నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) విధానం అమలులోకి తెచ్చింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల నైపుణ్యాలను గణితంలో మెరుగు పరచడం కోసం గణితం బోధించే ఉపాధ్యాయుల (స్కూల్ అసిస్టెంట్) సంకల్పంతో కార్యరూపం దాల్చింది తెలంగాణ మ్యాథ్స్ ఫోరం. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సుమారు 450 మంది గణిత ఉపాధ్యాయులతో ప్రారంభించిన ఈ మ్యాథ్స్ ఫోరం ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి సుమారు 14 వేల మంది గణిత ఉపాధ్యాయులను ఏకం చేసింది.

■ మ్యాథ్స్ ఫోరంలోని గణితం ఉపాధ్యాయులు సొంతంగా సేకరించిన నిధులతో ఉపాధ్యాయులకు శిక్షణ నివ్వడం, మెటీరియల్ అందజేయడంతో పాటు విద్యార్థులకు గణితంలో పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా డిసెంబర్ 22న నిర్వహించే జాతీయ గణిత దినోత్సవం రోజున రాష్ట్ర స్థాయిలో పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేస్తున్నారు. ఆదివారం హైదరాబాద్ (రంగారెడ్డి జిల్లా) పరిధిలోని హయత్ నగర్‌లో రాష్ట్ర స్థాయిలో తెలంగాణ మ్యాథ్స్ ఫోరం పరీక్షలు నిర్వహిస్తున్నారు.

సండే స్పెషల్



గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్..

గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ తమిళనాడు రాష్ట్రంలో 1887 లో జన్మించారు. చిన్నప్పటి నుంచి ఆయనకు గణితంపై ఆసక్తి ఉండేది. ఎనిమిదో తరగతిలోనే డిగ్రీ స్థాయిలో లెక్కల పుస్తకాలు చదివేవాడు. 15 ఏళ్ల వయసులోనే జార్జ్ స్క్రాచ్ కార్డు రూపొందించి 6 గణిత సిద్ధాంతాలను తులనాత్మకంగా పరిశీలించారు. 120 పైగా సిద్ధాంతాలను ప్రతిపాదించారు. లెక్కల్లో రామానుజన్ ప్రతిభ చూసి మద్రాస్ విశ్వవిద్యాలయం 75 రూపాయల ఫెలోషిప్ మంజూరు చేసింది. 1918లో రామానుజన్ ఫెలో ఆఫ్ ది రాయల్ ఫెలో ఆఫ్ ది ట్రినిటీగా ఎన్నికయ్యాడు.



ధర్పల్లి మండలం రేకులపల్లి పాఠశాల విద్యార్థులు తయారు చేసిన గణిత బోధన పరికరాలు

గణిత శాస్త్రం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాం



గణిత శాస్త్రం అభివృద్ధి కోసం ఫోరం సభ్యులం పాటుపడుతున్నాం. విద్యార్థులకు సులభ పద్ధతిలోను బోధించడంతో పాటు వారికి గణితం పట్ల అవగాహన పెంపొందించడానికి గణిత ఉపాధ్యాయులు విశేషంగా కృషి చేస్తున్నారు.
– చంద్రశేఖర్, గణిత శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు

ప్రకృతిలో దాగి ఉన్న అద్భుతం గణితం



గణితాన్ని ప్రకృతిలో దాగి ఉన్న అద్భుతమైన అందంలా చూస్తాను. ఈ దృష్టి నాలో విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి ప్రేరేపిస్తుంది. గణితం పోటీల్లో మోడల్ స్కూల్స్ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించాను. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చడానికి నన్ను నేను సిద్ధం చేసుకుంటున్నాను.
– సుంకం రతన్‌వీర్, పదో తరగతి విద్యార్థి, మోడల్ స్కూల్, ఆర్మూర్

లెక్కల్లో టెక్నిక్‌ను ప్రాక్టీస్ చేస్తాను



ఉపాధ్యాయులు చెప్పే టెక్నిక్ విధానం నేర్చుకోవడం, ప్రతి రోజు లెక్కలను, ఇతర బిట్స్ ప్రాక్టీస్ చేస్తాను. దీంతో పాటు ఇంటర్నెట్‌లో షార్ట్ కట్స్ నేర్చుకోవడం, సమయం దొరికినప్పుడల్లా లెక్కలు రివిజన్ చేయడం, చదువుకోవడం చేస్తున్నాను. ఫలితంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన ప్రతిభ పోటీల్లో జిల్లాపరిషత్ విభాగం నుంచి రాణించి ప్రతిభ కనబర్చాను.
– సాహితి, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఆర్మూర్

గణితంను సమస్యలా చూడను



మనిషి జీవితం గణితంతో ముడి పడి ఉంది. గణితంను సమస్యలా కాకుండా నిత్య జీవితానికి అనువర్తనం చేస్తూ చూడలి. గణితం నేర్చుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి. ప్రతిభ పరీక్షల్లో బహుమతి పొందాను.
– ఓ శివ కుమార్ పదవతరగతి, తల్వేద ఉన్నత పాఠశాల

ప్రతిభ పరీక్షలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి



విద్యార్థుల్లో అంతర్గతంగా దాగివున్న గణిత జిజ్ఞాసను వెలుగులోకి తీసుకురావడానికి ఈ గణిత ప్రతిభా పరీక్షలు చాలా ఉపయోగపడతాయి. కేవలం సమస్య సాధనను మాత్రమే కాకుండా వాటిలోని సోపానాలకు తార్కికంగా ఆలోచించి సాధించే విధంగా ఉండే ప్రశ్నలను ఈ గణిత ప్రతిభా పరీక్షలో పరీక్షిస్తాము. తద్వారా పిల్లల్లో గణిత నైపుణ్యాలు పెంపొందించి వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపుతాము.
– కృష్ణ, జిల్లా గణిత ఫోరం అధ్యక్షుడు

'అర్బన్' అభివృద్ధికి నిధులివ్వండి

- సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సీఎం చాంబర్‌లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో కలిసి ధన్‌పాల్ సీఎంకు వినతిపత్రం అందజేశారు. టీయూఎఫ్ఐడీసీ ఫండ్ రూ.60 కోట్లు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.5కోట్లు, స్పెషల్ ఫండ్ రూ.100 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయాలని విన్నవించారు. జిల్లా కేంద్రమైన అర్బన్ నియోజకవర్గంలో రోడ్లు, యూజీడీ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ప్రభుత్వ ఆస్పత్రిలో కనీస సదుపాయాలు, డబుల్ బెడ్‌రూం ఇండ్ల మరమ్మతులు, రేషన్‌కార్డులు, తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ధన్‌పాల్ పేర్కొన్నారు. పార్టీలకతీతంగా అందరినీ కలుపుకుని అర్బన్ అభివృద్ధికి పాటుపడాతమని ధన్‌పాల్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ధన్‌పాల్ సూర్యనారాయణ, సుదర్శన్‌రెడ్డి

మెరుగైన వైద్య సేవల కోసం మంత్రికి నివేదిస్తాం

- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- ఆయా విభాగాల అధిపతులతో సమీక్ష

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని శనివారం సాయంత్రం బోధన్ శాసన సభ్యులు పి సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సందర్శించారు. నూతనంగా నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్), క్రిటికల్ కేర్ యూనిట్ లతో కూడిన భవన సముదాయాన్ని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆదివారం లాంఛనంగా ప్రారంభోత్సవం చేసిన అనంతరం జీజీహెచ్‌లో ఉమ్మడి జిల్లాలోని ఆస్పత్రులు, వైద్యారోగ్య శాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష జరుపనున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే , కలెక్టర్ జీజీహెచ్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సూపరింటెండెంట్ చాంబర్లో ఆయా విభాగాల అధిపతులతో సమావేశమై వివిధ అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఒక్కో విభాగం వారీగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, డాక్టర్లు, సిబ్బంది ఖాళీలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, కొత్తగా సమకూర్చాల్సిన సదుపాయాలు తదితర వాటి గురించి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలను మరింతగా మెరుగుపర్చేందుకు అవసరమైన అన్ని వసతులు సమకూర్చాల్సిందిగా సంబంధిత మంత్రికి నివేదిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. వివిధ వైద్య సేవల కోసం ప్రతిరోజు సగటున రెండు వేల మంది వరకు రోగులు జీజీహెచ్ కు వస్తున్నారన్నారు. అన్ని విభాగాల పనితీరును మెరుగుపర్చేలా అవసరమైన వైద్యులు, సిబ్బందితో పాటు అధునాతన వైద్య పరికరాలు మంజూరు చేయాల్సిందిగా వైద్యారోగ్య శాఖ మంత్రి దృష్టికి తెస్తామని తెలిపారు.

ఆస్పత్రిని నిర్మించి సుమారు 14 ఏళ్లు అవుతున్నందున నిర్వహణ పరమైన లోపాలను కూడా చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జీజీహెచ్ తో పాటు బోధన్, ఆర్మూర్ తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొని ఉన్న ఇబ్బందులను అధిగమించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ ఉన్నారు.



జీజీహెచ్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ హనుమంతు

కాయిన్ పేరిట భారీ మోసం

- జిల్లాలో యుబిఈ. ఎక్స్ పేరిట సాగిన దందా
- రూ. లక్షల్లో నష్టపోయిన జనాలు
- ఉమ్మడి జిల్లాలో 135 మంది వరకు బాధితులు
- ఒత్తిళ్లు భరించలేక ఓ ప్రభుత్వ టీచర్ ఆత్మహత్య ?
- మోసపోయిన వారు విద్యావంతులే !

నిజామాబాద్‌అర్బన్: వారంతా ఉద్యోగస్తులు.. విద్యావంతులే.. పెట్టుబడికి రెండింతలు లాభం వస్తుందని చెప్పేసరికి ఆశ పడ్డారు.'కాయిన్' దందాకు మొగ్గుచూపారు. ఒక్కొక్కరు రూ. లక్షల్లో పెట్టుబడి పెట్టి నష్టపోయారు. యుబిఈ.ఎక్స్ పేరిట జిల్లాలోకాయిన్ దందా జోరుగా సాగింది. మొదట్లో కొందరికి లాభాలు రావటంతో వందలాది మంది టీచర్లు, విద్యావంతులు ఈ పెట్టుబడి దందా పట్ల ఆకర్షితులయ్యారు. ఒకరిని చేర్పిస్తే కమీషన్ రూపంలో మరింత లాభం అని చెప్పడంతో ఒకరి తర్వాత ఒకరు ఈ దందాలో చేరిపోయారు. బంధువులు, స్నేహితులను చేర్పించారు. దశల వారీగా డబ్బులు వస్తాయని చెప్పటంతో ఎదురు చూశారు. ఏడాదైనా డబ్బులు రాకపోవడంతో తాము మోసపోయామని గుర్తించి లబోదిబో మంటున్నారు. నష్టపోయిన వారిలో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన టీచర్లు, విద్యావంతులు ఉన్నారు. ఒక్కొక్కరు రూ. 25 వేల నుంచి రూ. 5 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు.

మొదట్లో నెల, రెండు నెలల పాటు పెట్టిన పెట్టుబడికి కొంతమందికి కొద్ది మేరకు డబ్బులు వచ్చాయి. దానిని నమ్మిన వారు మరింత మందిని చేర్పించి పెట్టుబడులు పెట్టించారు. ఇలా ఉమ్మడి జిల్లాలో 135 మంది వరకు బాధితులు ఉన్నారు. సుమారు రూ. 5 కోట్ల వరకు ఈ దందాలో పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. యుబిఈ.ఎక్స్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా కొందరు నేరుగా డబ్బులు చెల్లించగా, మరి కొందరు ఏజెంట్లకు ఇచ్చారు. గత ఏడాది చివరి నుంచి ఏజెంట్లు పత్తాలేకుండా పోయారు. ఎవరూ అందుబాటులో లేకపోవడంతో మోసపోయిన వారు ఆందోళన చెందుతున్నారు.

ముగ్గురు విద్యాశాఖ ఉద్యోగులు

ఈ కాయిన్ దందాకు విద్యాశాఖకు చెందిన ముగ్గురు ఉద్యోగులు మొదట ఆకర్షితులయ్యారు. వీరికి కొద్ది పాటి డబ్బులు రావడంతో బంధువులు, స్నేహితుల చేత ఇందులో డబ్బులు పెట్టించారు. విద్యాశాఖ ఉద్యోగి శ్రీనివాస్ రూ. 6 లక్షలు చెల్లించి మోసపోయాడు. మరో సీఆర్‌పీ ఉద్యోగి దత్తు తన ముగ్గురు స్నేహితులు ఒక్కొక్కరి చేత రూ.27 వేల చొప్పున కట్టించాడు. నిజామాబాద్, బోధన్ ప్రాంతానికి చెందిన 100 మంది వరకు, బాన్సువాడ, కామారెడ్డికి చెందిన మరో 35 మంది వరకు బాధితులు ఉన్నట్లు తెలిసింది. ఈ కాయిన్ దందాలో మోసపోయి గతేడాది జిల్లా కేంద్రంలోని సీతారాం నగర్‌లో కాలనీకి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. కోటగిరి మండలానికి చెందిన ఒకరు ఈ కాయిన్ దందాకు ప్రధాన వ్యక్తిగా బాధితులు తెలుసుకున్నారు. అతన్ని ప్రశ్నించగా కాయిన్ వెబ్సైట్ పని చేయడం లేదు. నేనేమీ చేయాలంటూ దురుసుగా ప్రవర్తించినట్లు బాధితులు పేర్కొన్నారు.



ఆరు లక్షలు చెల్లించి నష్టపోయాం

నేను రూ. 6 లక్షలు పెట్టుబడిగా చెల్లించాను. మొదట కొద్ది మేర డబ్బు వచ్చింది. దీంతో ఆశపడి నా బంధువుల పేరు మీద కూడా కాయిన్‌లు కొనుగోలు చేసి డబ్బులు పెట్టాను. ఆరు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన తర్వాత డబ్బులు రాలేదు. డబ్బులు చెల్లించే ఆన్లైన్ వెబ్సైట్ కనిపించకుండా పోయింది. దీంతో ఎవరిని సంప్రదించాలో తెలియక పీకల్లోతు అప్పుల్లో కూరుకు పోయాను. అధికారులు విచారణ చేసి న్యాయం చేయాలి.
– శ్రీనివాస్, బాధితుడు, విద్యాశాఖ ఉద్యోగి

ముగ్గురిని చేర్పించాను

ఈ కాయిన్ దందాలో నేను మొదట పెట్టుబడి పెట్టి డబ్బులు చెల్లించాను. కమీషన్ వస్తుందని ఆశతో నా స్నేహితులను మరో ముగ్గురిని చేర్పించాను. ఒక్కొక్కరు రూ. 30 వేల వరకు చెల్లించారు. తీరా డబ్బులు రాకపోవడం, వెబ్సైట్ ఓపెన్ కాకపోవడంతో ఎవరిని సంప్రదించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నాను.
– దత్తు, సిఆర్‌పి, విద్యాశాఖ ఉద్యోగి

క్లుప్తంగా

ప్రత్యేక తరగతులు నిర్వహించండి



నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ అన్నారు. జిల్లా ఇంటర్ విద్య కార్యాలయంలో శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల డీఐఈవో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశం మేరకు 90 రోజుల ప్రణాళికను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. కళాశాలలో ఇదివరకే సిలబస్ పూర్తి చేసినందున మరోసారి రివిజన్‌తోపాటు ప్రయోగశాలలో ప్రయోగాలను అన్నిటిని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ కళాశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని దానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌లను ఆదేశించారు.

ఏఐయూకేఎస్ జాతీయ కమిటీ సభ్యుడిగా ప్రభాకర్ ఎన్నిక



సిరికొండ: ఆలిండియా యునైటెడ్ కిసాన్ సభ జాతీయ కమిటీ సభ్యుడిగా ప్రభాకర్ ఎన్నికయ్యారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఈ నెల 19, 20వ తేదీల్లో పదిహేను రాష్ట్రాల ప్రతినిధుల సమావేశం జరిగింది. అనంతరం ఆలిండియా యునైటెడ్ కిసాన్ సభ ఆవిర్భవించింది. సంఘం నూతన జాతీయ కమిటీని ఎన్నుకున్నారు. జాతీయ కమిటీలో తెలంగాణకు చెందిన ముగ్గురు ఎంపికయ్యారు. సిరికొండ మండలంలోని గడ్కోల్ కేంద్రంగా విప్లవ రైతాంగ ఉద్యమాలు నడిపిన ప్రభాకర్ జాతీయ కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యారు. దీంతో జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బెంబేలెత్తిస్తున్న బైపాస్

- ప్రమాదకరంగా అంతర్‌రాష్ట్ర బైపాస్ రోడ్డు
- మూలమలుపుల వద్ద భారీ గుంతలు
- కానరాని హెచ్చరిక బోర్డులు



సాలూర క్యాంప్ వద్ద పాత బీటీ రోడ్డు మూల మలుపు వద్ద సైడ్‌వాల్ లేని కల్వర్టు, పక్కనే భారీ గుంత

బోధన్: అంతర్‌రాష్ట్ర రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొత్తగా నిర్మించిన బైపాస్ బీటీ రోడ్డు అంచున వేసిన మొరం వర్షానికి కొట్టుకుపోయి అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో బైపాస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో రోడ్డు అంచున గుంతలు కనిపించక ద్విచక్రవాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా రోడ్డు దిగితే ప్రాణాలకే ముప్పు ఏర్పడే పరిస్థితి ఉంది. ప్రాణాలు పోతేనే అధికారులు స్పందిస్తారా? అని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతర్‌రాష్ట్ర రోడ్డు విస్తరణ పనులు, నిర్వహణపై పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.35 కోట్లతో అంతర్‌రాష్ట్ర రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు అధికారులు ప్రారంభంలోనే వెల్లడించారు. ఈ రోడ్డు పనులతో తెలంగాణ – మహారాష్ట్ర మధ్య రవాణా మరింత సౌలభ్యంగా మారినప్పటికీ రోడ్డు పక్కన ఏర్పడిన గుంతలను పూడ్చివేయాల్సిన అవసరం ఉంది.

బోధన్ పట్టణ శివారు నుంచి మహారాష్ట్ర ప్రాంతంలోని 63వ జాతీయ రహదారికి అనుసంధానంగా నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామాల మీదుగా సాలూర అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టు వరకు 8.3 కిలో మీటర్ల పొడువునా నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. పాత బీటీ రోడ్డు విస్తరణతోపాటు మూడు గ్రామాల శివారులోని పంట పొలాల మధ్యలో సుమారు 4 కిలో మీటర్ల పొడువునా కొత్తగా బైపాస్ రోడ్డు నిర్మించారు. నాగన్‌పల్లి గ్రామ శివారులో ఉన్న పసుపు వాగుపై కొత్తగా చేపట్టిన భారీ వంతెన నిర్మాణ పనులు ఆఖరి దశకు చేరగా, కొంత కాలంగా పనులు నిలిచిపోయాయి. పనులను కాంట్రాక్టర్ అప్పగించగా, నేషనల్ హైవే అథారిటీ పర్యవేక్షిస్తోంది.



కొప్పర్తి గ్రామ క్రాసింగ్ వద్ద సైడ్‌వాల్‌లేని కల్వర్టు, పక్కనే లోతైన గుంత



నాగన్‌పల్లి గ్రామ శివారులోని పసుపు వాగుపై కొత్తగా నిర్మించిన వంతెన

పొంచి ఉన్న ప్రమాదాలు

ఏడాది క్రితం నుంచి బైపాస్ రోడ్డు మీదుగా ప్రతిరోజూ వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. బోధన్, సాలూర మండలాల పరిధిలోని సుమారు 20 గ్రామాల ప్రజలు బోధన్‌కు ఇదే రోడ్డు మీదుగా వెళ్తున్నారు. సాలూర క్యాంప్, నాగన్‌పల్లి, సాలూర గ్రామాల మధ్య బైపాస్ రోడ్డులో పంట పొలాల మధ్య సాగు నీటి పారకం కోసం నిర్మించిన కల్వర్టు సైడ్‌వాల్స్ రోడ్డు అభివృద్ధి క్రమంలో మట్టిలో కూరుకుపోయాయి. కల్వర్టుల వద్ద ఇరువైపులా భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. బైపాస్ రోడ్డుకు లింకేజీగా ఉన్న పాత బీటీ రోడ్డు మూలమలుపుల వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. భారీ గుంతల వద్ద కనీసం ప్రమాద సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. నేషనల్ హైవే ఈఈ కాంతారావును బైపాస్ రోడ్డు పరిస్థితిపై వివరణ కోరగా.. అంతర్‌రాష్ట్ర బైపాస్ రోడ్డు అంచున గుంతలు, కల్వర్టుల పరిస్థితులను పరిశీలిమన్నారు. ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అధికారులు స్పందించాలి



సాలూర, సాలూర క్యాంప్, నాగన్‌పల్లి గ్రామాల శివారులో పాత బీటీ రోడ్డు మూల మలుపులు, కల్వర్టుల వద్ద ఏర్పడిన భారీ గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు అంచుల్లో మొరం కొట్టుకుపోయి గుంతలు ఏర్పడి వాహనదారులు రోజూ ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. కనీసం భారీ గుంతల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– ఆర్ సురేశ్, సాలూర గ్రామస్తుడు



జీజీహెచ్ వెనుక ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

మంత్రి వస్తున్నారని..



పూలకుండీల్లో ప్రత్యక్షమైన మొక్కలు..



అందుబాటులోకి వచ్చిన తాగునీరు..

ఎప్పుడూ అపరిశుభ్ర వాతావరణం కొట్టొచ్చినట్టు కనిపించే జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నట్టుండి పరిశుభ్ర వాతావరణంతో కళకళలాడుతోంది. ఎన్నో రోజులుగా తాగునీరు లభించక ఇబ్బందులు పడిన రోగులు, వారి సహాయకులకు శనివారం ఉన్నట్టుండి ఉచిత తాగునీరు అందుబాటులోకి వచ్చింది. ఉన్నట్టుండి పరిస్థితిలో ఈ స్థాయికి మార్పునకు కారణంగా వైద్యారోగ్యశాఖమంత్రి రానుండడమే..!

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



సెల్ఫ్‌లపై చెత్తను తొలగిస్తూ..



క్యాజువల్ వార్డును శుభ్రం చేస్తున్న సిబ్బంది

మాతా శిశు సంరక్షణ భవన నిర్మాణానికి ఏడేళ్లు

- రూ. 32కోట్లతో పనులు
- నేడు ప్రారంభించనున్న మంత్రి దామోదర



నిజామాబాద్‌నాగారం: మాతా శిశు సంరక్షణ కేంద్రం, క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి ఏడేళ్లు పట్టింది. 2017లో పనులు ప్రారంభం కాగా, రెండో అంతస్తు వరకు రూ.15 కోట్లతో పనులు పూర్తి చేశారు. ఆ తరువాత జీజీహెచ్‌లో సరిపడా స్థలం లేకపోవడంతో మాతా శిశు సంరక్షణ భవనంపై మరో రెండు అంతస్తుల నిర్మాణ పనులను 2020 తర్వాతా చేపట్టారు. మొత్తం మీద ఏడేళ్లలో రూ.38.75కోట్లు వెచ్చించి నిర్మాణం పూర్తి చేశారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర నర్సింహ ఆదివారం భవనాన్ని ప్రారంభించనున్నారు. అతి త్వరలోనే డెలివరీలు, పిల్లలకు చికిత్స తదితర సేవలు మాతా శిశు సంరక్షణ కేంద్రంలోనే అందించనున్నారు. క్రిటికల్ కేర్ సర్వీసులు సైతం ఈ భవనంలోనే అందిస్తారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

చికిత్స పొందుతూ తాపిమేస్త్రి మృతి

నిజామాబాద్ రూరల్: గోడ పైనుంచి పడిన ఘటనలో తీవ్రగాయాలపాలైన తాపిమేస్త్రి పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన రూరల్‌పోలీస్ స్టేషన్ పరిధిలోని గుపన్‌పల్లిలో చోటు చేసుకుంది. రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాకు చెందిన బత్తుల శ్రీను గూపన్‌పల్లిలో ఉంటూ మేస్త్రి పనులు చేస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం రోజున పనికి వెళ్లిన శ్రీను గోడ నిర్మిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తలకు బలమైన గాయాలయ్యాయి. శీనును ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య భక్తుల ధనలక్ష్మి ఆంధ్ర నుంచి రావడం ఆలస్యం కావడంతో శనివారం ఉదయం పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కటుంబీలకు అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పరిధిలోని నిజామాబాద్ రైల్వే స్టేషన్ వద్ద మురికికాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మొగులయ్య శనివారం తెలిపారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 సంవత్సరాలు ఉంటుందని, పసుపు రంగు షర్ట్, బ్లూ కలర్ ప్యాంట్, బ్లాక్ కలర్ స్వెటర్ ఉందని వివరించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

పరిస్థితి విషమించి ..



గోండ్ల శంకర్(ఫైల్)

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : విద్యుత్‌షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గోండ్ల శంకర్(36) పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 6వ తేదీన పొలం వద్ద విద్యుత్ షాక్‌కు గురైన శంకర్‌ను నిజామాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కుడిచేయి, మెడ, ఛాతి భాగం కాలిపోవడంతో పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



కావేరి మృతదేహం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు పెద్దతండాకు చెందిన ధనావత్ కావేరి(26) అనే వివాహిత శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కావేరి భర్త ట్రాక్టర్ బోల్తాపడి ఆరు నెలల క్రితం మృతి చెందగా, పిల్లలు ఆదిత్య, శ్రీవిఘ్నేశ్‌తో కలిసి ఉంటోంది. శనివారం ఉదయం ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అయితే తన కూతురి మరణంపై అనుమానం ఉందని కావేరి తండ్రి కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హోటల్‌లో మద్యం పట్టివేత



కామారెడ్డి క్రైం: నిబంధనలకు విరుద్ధంగా మద్యం సిట్టింగ్ నిర్వహిస్తున్న ఓ హోటల్‌పై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని విజయదుర్గా భవానీ హోటల్‌లో తనిఖీలు చేశారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని హోటల్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

మాక్లూర్: మండలంలోని బోర్గాం(కె) శివారులో ఫూలాంగ్ వంతెన కింద నుంచి మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లతోపాటు జేసీబీని శనివారం పట్టుకున్నట్లు ఆర్‌ఐ షఫీ తెలిపారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందం



రుద్రూర్: పోతంగల్ మండలంలోని మంజీరా పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీసులతో కలిపి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం ప్రతి రోజూ రాత్రి 9 గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు నది పరీవాహక ప్రాంతాల్లో పర్యటించనుంది. ఇసుక అక్రమరవాణా చేసే వాహనాలను బృందం సభ్యులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తారని తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. పట్టుబడ్డ వాహన యాజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో స్పెషల్ డ్రైవ్



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏసీపీ రాజా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న 18 ద్విచక్ర వాహనాలతోపాటు ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎఎస్‌హెచ్‌వో రఘుపతి, సీసీఎస్ సీఐ వీరయ్య, ఎస్సై మొగిలయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో శుక్రవారం అర్ధరాత్రి పేకాటస్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ.8,150 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మల్లూర్‌లో నలుగురి పట్టివేత

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మల్లూర్ గ్రామ శివారులో ఉన్న శ్మశాన వాటికలో పేకాట ఆడుతున్న నలుగురిని శనివారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.11,540 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కొండాపూర్‌లో..

సిరికొండ: మండలంలోని కొండాపూర్ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.2420 నగదు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ఒకరి అదృశ్యం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రానికి చెందిన కటికె కపిల్(28) అదృశ్యమైనట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. ఈనెల 18న నుంచి తన భర్త కనిపించడం లేదని కపిల్ భార్య లావణ్య ఫిర్యాదుచేసిందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సాగునీటి ప్రాజెక్టులు

- వైఎస్ హయాంలో గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల నిర్మాణం
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- అలీసాగర్, శాఖాపూర్ ఎత్తిపోతల నీటి విడుదల



అలీసాగర్ ఎత్తిపోతల నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట: రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం గతంలోనే సాగునీటి ప్రాజెక్టులను నిర్మించిందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని శాఖాపూర్, ఆలీసాగర్ ఎత్తిపోతల పథకాల నుంచి శనివారం ఎమ్మెల్యే సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంసాగర్ చివరి ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో గుత్ప, అలీసాగర్ వంటి ప్రాజెక్టులను నిర్మించి రైతులకు అండగా నిలిచిందన్నారు. సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని, మార్చి చివరివరకు నాలుగు విడతలుగా నీటిని విడుదల చేస్తామన్నారు. భూసారాన్ని పరిరక్షించేందుకు వరికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. షెడ్డు మాదిరి పందిరిల నిర్మాణానికి ప్రభుత్వం ఎకరానికి రూ.3 లక్షల మేర 50 శాతం సబ్సిడీపై రుణాలిస్తోందని పేర్కొన్నారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని నడిపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులు చెరకు సాగుపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, గడుగు గంగాధర్, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, మోబీన్, సాయారెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, బుచ్చన్న, విజయ్,సంజీవ్‌రావు,గౌరు రాజు నీటిపారుదల శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్‌కు చెందిన దాసరి రాజు అనే యువకుడిని పోక్సో కేసులో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 5వ తేదీన మండలంలోని ఓ మైనర్‌బాలికను రాజు తన బైక్‌పై ఎక్కించుకొని హైదబాద్‌లోని షాపూర్‌కు తీసుకెళ్లి ఓ గదిలో ఉంచాడు. తమ కూతురు కనిపించడం లేదని బాలిక తల్లిదండ్రులు అదే రోజున పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టిన విషయం తెలుసుకున్న రాజు బాలికను శనివారం మండలకేంద్రంలోని గోపాల్‌పేటలో వదిలి వెళ్లిపోతుండగా పట్టుకున్నారు. రాజును అరెస్టు చేయడంతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. రాజును రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ఎస్సై మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళను వేధించిన యువకుడిపై కేసు

రుద్రూర్: స్నేహితుడి భార్యను వేధించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు తన స్నేహితుడి భార్యకు కొద్ది రోజులుగా ఫోన్‌లో మెస్సేజ్‌లు చేస్తున్నాడు. అవతలి వ్యక్తి ఎవరు అనేది తెలియక మహిళతోపాటు ఆమె భర్త కొద్ది రోజులుగా ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో మహిళ తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. అయినప్పటికీ మెస్సేజ్‌లు వస్తుండడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిఘా పెంచిన మహిళ కుటుంబ సభ్యులు మెస్సేజ్‌లు చేస్తున్న వ్యక్తి మద్నూర్‌లో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లారు. సదరు మహిళ భర్త స్నేహితుడే మెస్సేజ్‌లు చేస్తున్నట్లు గుర్తించి అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంట్లో నిప్పంటించిన వ్యక్తి అరెస్ట్

ఖలీల్‌వాడి: భార్యపై కోపంతో అత్తవారింట్లో పెట్రోల్ పోసి నిప్పంటించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మూడో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై హరిబాబు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని సుభాష్‌నగర్ చెందిన శ్రీరామ్ గాయత్రికి మహారాష్ట్రలోని బోకర్‌కు చెందిన రమేశ్‌తో 2017లో వివాహమైంది. గొడవలు కావడంతో భర్తపై గాయత్రి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ రమేశ్ తన పద్దతి మార్చుకోకుండా బంగారం ఇవ్వాలని వేధించడంతో 20 రోజుల క్రితం గాయత్రి తన తల్లిగారింటికి వచ్చేసింది. దీంతో తన భార్యతోపాటు ఆమె కుటుంబ సభ్యులను చంపాలనే ఉద్దేశంతో రమేశ్ ఈనెల 19న ఉదయం 9.30 గంటలకు పెట్రోల్ తీసుకుని వచ్చి గాయత్రి ఇంట్లో పోసి నిప్పంటించి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. గాయత్రి ఫిర్యాదు మేరకు ఆమె భర్త రమేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.